సాక్షి
కృష్ణాజిల్లా
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన ఎం.శశితేజ కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది.



మర్యాదపూర్వకంగా..

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపిని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



'శక్తి' యాప్‌పై అవగాహన

విజయవాడస్పోర్ట్స్: మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ కె.లతాకుమారి పర్యవేక్షణలో శక్తి టీం ఆంధ్రా లయోలా, ఎస్ఆర్ఆర్ కాలేజీల్లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

ప్రధానమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖరబాబు



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులకు పునర్ శంకుస్థాపన చేసేందుకు మే రెండో తేదీన విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో కమిషనరేట్‌లో పోలీసు అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానితోపాటు వీవీఐపీలు, వీఐపీలు పాల్గొంటున్న దృష్ట్యా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో శాంతి భద్రతలు, ట్రాఫిక్ పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తుకు కావల్సిన ఏర్పాట్లపై ఈ సమీక్షలో చర్చించారు. డీసీపీలు కె.జి.వి.సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఎ.బి.టి.ఎస్.ఉదయారాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్, ఎం.రాజారావు, కె.కోటేశ్వరరావు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మచిలీపట్నంఅర్బన్: పరిసరాల పరిశుభ్రతే ప్రజారోగ్యానికి తొలిమెట్టని కృష్ణా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. శర్మిష్ట అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగునీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. గతంతో పోలిస్తే మలేరియా కేసులు ఏటేటా తగ్గుముఖం పడుతున్నాయని పేర్కొన్నారు. దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో దోమల నియంత్రణ మందులు పిచికారీ చేయించాలన్నారు. పరిసరాల్లో కొబ్బరి బోండాలు, రోళ్లు, పాతటైర్లు వంటివి లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి బి. రామారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛత, వ్యక్తిగత రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

బంగారు తాపడం పనులకు రూ. 5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శుక్రవారం రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన టి. శ్రీనివాస్ సంపత్ శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారిని కలిసి రూ. 5 లక్షల విరాళాన్ని ఆలయ బంగారు తాపడం పనుల నిమిత్తం అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం చేయడంతోపాటు ప్రజల సమయం ఆదా చేసేందుకు రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తెచ్చినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఏ రవీంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూర్ కోడ్ స్కాన్ చేసి సులభంగా స్లాట్ బుక్ చేసుకునే వీలు కల్పించామన్నారు. ఈ నెల 4నుంచే విజయవాడ రీజియన్‌లోని గాంధీనగర్, మచిలీపట్నం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. శనివారం నుంచి కృష్ణా జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్, ఎన్టీఆర్ జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు ఉపయోగించుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలని కోరారు.

బొద్దు.. వద్దే వద్దు!

బరువెక్కిన బాల్యం.. తప్పదు భారీ మూల్యం

- గుణదలకు చెందిన వినయ్(పేరు మార్చాం) 9వ తరగతి చదువుతున్నాడు. ఊబకాయం కారణంగా యాక్టివ్‌గా ఉండకపోవడంతో పాటు ఇటీవల నీరసంతో పడిపోయాడు. వైద్యులు పరీక్షించగా మధుమేహం స్థాయిలు ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు.
- భవానీపురానికి చెందిన 10వ తరగతి విద్యార్థి రాకేష్(పేరుమార్చాం) చిన్నప్పుడు బాగానే ఉన్నా, నాలుగేళ్లుగా ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడంతో ఒకేసారి బరువు పెరిగాడు. దీంతో క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం లేక పోవడంతో మానసికంగా కుంగుబాటుకు గురై చదువులో కూడా రాణించలేక పోతున్నాడు.

ఇలా వీరిద్దరే కాదు అనేక మంది పిల్లలు ఒబెసిటీ కారణంగా శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- పిల్లల్లో ఒబెసిటీతో మానసిక, ఆరోగ్య సమస్యలు
- డిప్రెషన్‌తో చదువులోనూ రాణించలేకపోతున్న వైనం
- వేసవి సెలవుల్లో వ్యాయామంపై దృష్టి పెట్టాలంటున్న వైద్యులు
- తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు పిల్లలు బొద్దుగా ఉంటే ముద్దుగా ఉన్నాడని అనేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. బొద్దు ముద్దు కాదంటున్నారు. అలాంటి వారిలో చలాకీతనం లేకపోవడంతో పాటు, చిన్న వయస్సులోనే అనేక మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వయసుకు తగిన బరువు ఉంటే చాలని, అధిక బరువు అనర్థాలకు దారి తీస్తోందంటున్నారు. ప్రస్తుతం ప్రతి వంద మంది పిల్లల్లో 18 మంది అధిక బరువుతో ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

ఊబకాయుల్లో సమస్యలివే..

- ఒబెసిటీ ఉన్న పిల్లలు సహచర పిల్లల నుంచి తరచూ అవహేళనకు గురవుతుంటారు. దీంతో డిప్రెషన్‌కు గురవుతారు.
- లావుగా ఉన్న పిల్లలు సరిగా ఆడరని క్రీడల్లోకి రానివ్వరు. ఇది కూడా పిల్లలపై వ్యతిరేక ప్రభావం చూపుతుంది.
- చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఆయాసం వస్తుంది.
- చదువులో కూడా రాణించలేరు.
- టీనేజ్‌లోకి వచ్చే సరికి డిప్రెషన్ ఎక్కువ అవుతుంది.
- ప్రీ డయాబెటిస్, హైపర్‌టెన్షన్ చిన్న వయస్సులోనే దరిచేరతాయి.
- స్కిన్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ రావచ్చు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి..

పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చేశారు. పిల్లలు ఇంటి వద్దే ఉంటూ స్మార్ట్‌ఫోన్‌లు, టీవీల్లో తమకిష్టమైన చానల్స్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలా నిశ్చల జీవనశైలికి అలవాటు పడటం మంచిది కాదంటున్నారు వైద్య నిపుణులు. ఇప్పటికే ఫాస్ట్ ఫుడ్స్ వంటి వాటితో ఒబెసిటీ పిల్లలు ఎక్కువయ్యారు. ఒబెసిటీని అధిగమించేందుకు ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. అవుట్‌డోర్, ఇన్‌డోర్ క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, తాజా సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవడం ద్వారా ఒబెసిటీని తగ్గించుకోవచ్చునంటున్నారు.



పిల్లలూ ఇలా చేయండి..

- వేసవి సెలవులు 50 రోజులకు పైగానే ఇచ్చారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడలు ఆడండి.
- అవసరమైతే సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో చేరండి.
- స్విమ్మింగ్ చేయడం ఎంతో మంచిది.
- సైకిల్‌ను ఇష్టంగా ప్రతిరోజూ తొక్కండి.
- జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండండి.
- సెల్‌ఫోన్, టీవీ చూస్తూ భోజనం చేసే వారు తగిన మోతాదు కంటే ఎక్కువ తినేస్తారు. ఆ అలవాటు మానుకోవాలి.
- సెల్‌ఫోన్, టీవీ చూసే టైమ్ తగ్గించాలి.

డయాబెటిస్ వచ్చే ప్రమాదం..



ఒబెసిటీ ఉన్న పిల్లల్లో టైప్–2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంది. కొందరిలో సుగర్ లెవల్స్ అదుపులో ఉండవు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ కారణంగా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వారంలో రెండు, మూడు సార్లు జంక్‌ఫుడ్, బయట ఆహారం తీసుకోవడం, సెకండరీ లైఫ్‌తో ఊబకాయులుగా మారుతున్నారు. తల్లిదండ్రులు వారిని గుర్తించి.. వాకింగ్, వ్యాయామం వంటివి చేయిస్తే మంచిది. అందుకు వేసవి సెలవులను వినియోగించుకోవాలి.

– డాక్టర్ ఎం. సునీత, మధుమేహ నిపుణురాలు

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి..



ఒబెసిటీతో ఉన్న పిల్లలు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. వేసవిలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా స్లిమ్‌గా మారవచ్చు. వేసవిలో దొరికే మామిడి లాంటి సీజనల్ ఫ్రూట్స్‌తో పాటు, ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే అవుట్‌డోర్ క్రీడలు ఆడాలి. ఎండలో ఆడితే డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

– గర్రె హరిత, న్యూట్రీషియన్

కృష్ణా వర్సిటీకి ఉన్నత విద్యా అవార్డు



అవార్డు అందుకుంటున్న వర్సిటీ రెక్టార్ బసవేశ్వరరావు

రుద్రవరం (మచిలీపట్నం రూరల్): కృష్ణా వర్సిటీ ప్రతిష్టాత్మక ఇండియా ఉన్నత విద్యా అవార్డ్ సాధించిందని విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనితీరు ఆధారంగా కృష్ణా వర్సిటీ మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఎడ్యుకేషన్ వరల్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యూఢిల్లీలోని హోటల్ గ్రాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు జతీన్ పరాంజపే చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు బసవేశ్వరరావు తెలిపారు. తొలుత శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలు, పొందుతున్న ఫలితాలపై బసవేశ్వరరావు ప్రసంగించారు.

30న జాబ్‌మేళా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యాన ఈ నెల 30న ఉయ్యూరులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. పలు కంపెనీల్లో ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి పీజీ చదివిన 18 నుంచి 30 సంవత్సరాల్లోపు యువత అర్హులని వివరించారు. ఎంపికైన వారికి ఆకర్షణీయ వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96187 13243, 88851 59008లో సంప్రదించాలని సూచించారు.

కొవ్వొత్తులతో ముస్లింల శాంతి ర్యాలీ



చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు

చల్లపల్లి: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లి–మచిలీపట్నం రహదారిలోని పెద్ద మసీదు వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన సెంటర్ నుంచి వైశ్యబజార్ మీదుగా సాగింది. కొవ్వొత్తులు వెలిగించి చనిపోయినవారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. కులమతాల భేదాలు వద్దు.. ఐకమత్యమే ముద్దు, హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ముస్లిం మత గురువు ఇమామ్, పెద్ద మసీదు కమిటీ అధ్యక్షుడు నసీం షేరి, గౌసియా మసీదు అధ్యక్షుడు షేక్ అబూ షరీఫ్, చల్లపల్లి, నారాయణరావునగర్‌కు చెందిన ముస్లిం పెద్దలు, యువత, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డీఎస్సీ నిబంధనలు సడలించాలి

డీవైఎఫ్ఐ ధర్నా



విజయవాడ ధర్నా చౌక్ వద్ద తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ నోటిఫికేషన్‌లో అనేక లోపాలు ఉన్నాయని, నిబంధనలు సడలించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలను డీఎస్సీకి అనర్హులు చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో 45, 50 శాతం మార్కులు ఉండాలన్న నిబంధనను తొలగించాలన్నారు. తెలంగాణలో సైతం 40 శాతానికి అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. సిలబస్ విస్తృతిరీత్యా అభ్యర్థుల ప్రిపరేషన్‌కు 90 రోజులు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలు ఒకే సమయంలో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి అప్లై చేసుకోడానికి ఇచ్చిన వెబ్ సైట్స్, టోల్ ఫ్రీ నంబర్లు పని చేయడం లేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, జిల్లా అధ్యక్షుడు పి. కృష్ణ, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు శివ, పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం అమ్మొద్దు

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు అమ్మొద్దని మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గాంధీనగర్‌లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకుని నష్టపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మిల్లర్లు తక్కువ ధరకు కొంటున్నారని వస్తున్న వార్తలను ఖండించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు లేని ధాన్యాన్ని తక్కువకు కొనుగోలు చేసి ఉండొచ్చని వివరించారు. మిల్లర్లు ఏవైనా అవకతవకలకు పాల్పడితే అసోసియేషన్ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పులిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి అన్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య మిథ్య!

దూరవిద్యలో దారుణ ఫలితాలు

- ఓపెన్ స్కూల్ ఫలితాల్లో భారీగా పడిపోయిన ఉత్తీర్ణత
- 'పది'లో 25వ స్థానం, ఇంటర్‌లో 24వ స్థానానికి పరిమితమైన జిల్లా
- సకాలంలో అందని పాఠ్య పుస్తకాలు, జరగని తరగతులు
- ఓపెన్ స్కూల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



ఓపెన్ స్కూల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఇదీ ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి:

ఓపెన్ 'పది' పరీక్షలు రాసిన విద్యార్థులు	: 1,499
పాసైన వారు	: 65
ఉత్తీర్ణతా శాతం	: 4.34
ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు	: 2,751
పాసైన వారు	: 567
ఉత్తీర్ణతా శాతం	: 20.61

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యలవాడగా పేరుగాంచిన జిల్లాలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఫలితాలు అందరినీ షాక్‌కు గురిచేశాయి. అధికారుల తీరు, కోఆర్డినేటర్ల నిర్లక్ష్యంతో జిల్లా ప్రతిష్టను దిగజార్చటమే కాకుండా అభ్యర్థుల భవితతో ఆటలాడుతున్నారంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. మార్చి మాసంలో సాధారణ ఎస్ఎస్‌సీ పరీక్షలు, ఇంటర్మీడియెట్ పరీక్షలతో పాటుగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్‌లో అభ్యసించే పది, ఇంటర్ అభ్యర్థులకు సైతం పరీక్షలను ఏకకాలంలో నిర్వహించింది. సాధారణ పదో తరగతి పరీక్ష ఫలితాలతో పాటుగా ఓపెన్ స్కూల్ ఫలితాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఆ ఫలితాల్లో రాష్ట్రంలో 26 జిల్లాల్లోనూ 24, 25 స్థానాల్లో ఎన్టీఆర్ జిల్లా ఉండటం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది.

అందని పాఠ్య పుస్తకాలు..

సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులకు సంబంధించి ఏటా ఆ సంస్థ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తుంది. ఫీజు చెల్లించిన వారికి పుస్తకాలను సకాలంలో పంపిణీ చేస్తుంది. కానీ ఈ ఏడాది సకాలంలో పుస్తకాలు అందలేదని ఆయా కోర్సులకు ఫీజులు చెల్లించిన విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీనిపై పత్రికల్లోనూ వార్తలు వచ్చాయి. వాటికి సంబంధించి కోఆర్డినేటర్లు సైతం పలు కారణాలను చెబుతూ తమను తప్పుదోవ పట్టించారని పలువురు ఫీజు చెల్లించిన అభ్యర్థులు వాపోతున్నారు. సకాలంలో పుస్తకాలు అందకపోవటం వల్లే చాలా మంది అరకొర చదువులతో పరీక్షలకు హాజరయ్యారని, అందుకే ఈ తరహా ఫలితాలు వచ్చాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఈ ఏడాది పూర్తిగా పర్యవేక్షణను వదిలేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దాంతో అడ్మిషన్ల సంఖ్య భారీగానే పడిపోయిందని, అలాగే ఫలితాలు సైతం దిగజారిపోయాయంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యాపీఠం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన విధులను సైతం నిర్వహించలేదని దానిని రాష్ట్ర స్థాయి అధికారులు సైతం పర్యవేక్షించలేదని కోఆర్డినేటర్లు చెబుతున్నారు.

కానరాని తరగతుల జాడ..

ఫీజు చెల్లించిన అభ్యర్థులకు ఆయా స్టడీ సెంటర్ల ద్వారా కోఆర్డినేటర్లు తరగతులను నిర్వహించాల్సి ఉన్నా.. అలా జరగలేదు. సార్వత్రిక విద్యాపీఠం జిల్లా అధికారులు ఎక్కడా సరైన పర్యవేక్షణ కానీ పరిశీలన కానీ చేసిన దాఖలాలు లేవని పలువురు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. అందువల్లే కోఆర్డినేటర్లు తరగతులు నిర్వహించకుండానే తమ నుంచి వేలాది రూపాయలు దండుకొని రోడ్డుపైన వదిలేశారంటూ వాపోతున్నారు.

వేలాది రూపాయలు దండుకున్నారు!

తమ నుంచి వేలాది రూపాయలు దండుకున్నారని, తీరా పరీక్ష ఫలితాల్లో తమకు అన్యాయం చేశారంటూ పలువురు అభ్యర్థులు కోఆర్డినేటర్లను ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఓపెన్ స్కూల్ కోర్సులను నిర్వహించే సంస్థలు విద్యార్థులకు పలు మాయ మాటలు చెప్పి వారి నుంచి వేలాది రూపాయలు దండుకున్నారని ప్రచారం జరిగింది. 'మిమ్మల్ని పాస్ చేయిస్తాం, మీరు చూసి రాసుకోవచ్చు' అంటూ పలు రకాలుగా వారిని మభ్యపెట్టి భారీ వసూళ్లకు పాల్పడిన విషయాలపై పెద్ద స్థాయిలో విమర్శలు సైతం వచ్చిన విషయం తెలిసిందే. తీరా పరీక్షలు సాధారణ షెడ్యూల్‌లో పెట్టడం, గట్టిగా నిఘా ఉంచటం, ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చేయటంతో ఫలితాలు ఒక్కసారిగా తారుమారయ్యాయి.

ఫలితం.. సు'దూరం'

- ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి పదో తరగతికి 4.34 శాతం, ఇంటర్మీడియెట్‌లో 20.61 శాతం ఫలితాలు వచ్చాయి.
- 'పది'లో రాష్ట్రంలోనే 25వ స్థానంలో నిలువగా, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 24వ స్థానంలో నిలిచింది.
- పదో తరగతి పరీక్షలకు 1,499 మంది హాజరయ్యారు. అందులో వారిలో 785 మంది బాలురు, 714 బాలికలు ఉన్నారు. అందులో కేవలం 65 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో 26 మంది బాలురు, 39 మంది బాలికలు ఉన్నారు.
- ఇంటర్మీడియెట్ కోర్సుకు సంబంధించి 2,751 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 1715 మంది బాలురు, 1036 మంది బాలికలు ఉన్నారు. అందులో 567 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 301 మంది బాలురు, 266 మంది బాలికలు ఉన్నారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రంలో మంత్రి తనిఖీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వంట గది, అభ్యర్థుల విశ్రాంతి గదులు, బాత్ రూమ్‌లను పరిశీలించారు. అదే సమయంలో సీ సెట్ పరీక్ష జరుగుతున్న తరగతిని సందర్శించారు. ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని కో ఆర్డినేటర్ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే డిజిటల్ లైబ్రరీని సందర్శించి అక్కడ ఉన్న అభ్యర్థులతో మాట్లాడారు. స్టడీ మెటీరియల్ సరఫరా, అధ్యాపకుల బోధన క్లాసుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.

అధికారులపై ఆగ్రహం..

శిక్షణ కేంద్రంలోని వంట గది, విశ్రాంత గదులు అపరిశుభ్రంగా ఉండటంపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పక్వానికి రాని అరటి పండ్లను చూసి అక్కడే ఉన్న బీసీ వెల్ఫేర్ అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వం రూపొందించిన చార్ట్ ప్రకారం మెనూ అమలు చేయాలని, రుచికరమైన భోజనం అభ్యర్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం అభ్యర్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

క్లుప్తంగా

పాకిస్తానీయుల వీసాలు రద్దు

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో పాకిస్తానీయులు ఎవరైనా ఉంటే వారి వీసాలు రద్దు చేశామని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య, దీర్ఘకాలిక, దౌత్య, అధికారిక వీసాలు మినహా మిగిలిన భారత ప్రభుత్వం జారీ చేసిన వీసాలు ఈ నెల 27వ తేదీ నుంచి రద్దయ్యాయని వివరించారు. పాకిస్తానీయులకు ఆ దేశం జారీ చేసిన వైద్య వీసాలు ఏప్రిల్ 29 వరకే చెల్లుబాటు అవుతాయని, కొత్త వీసాలు జారీ చేయరని తెలిపారు.

కలంకారి క్లస్టర్‌పై సమీక్ష

పెడన: పెడనలో ఏర్పాటు చేయనున్న కలంకారి క్లస్టర్‌పై కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమీక్షించారు. శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పరిశ్రమల అధికారి వెంకట్రావుతో పాటు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కమిటీ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్, క్లస్టర్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులతో క్లస్టర్ పురోగతిపై సమీక్షించి తదుపరి చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

ముగిసిన ఎంపీఏ ప్రాక్టికల్స్

కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ మండలం కూచిపూడిలో శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠంలో జరుగుతున్న ఎంపీఏ (మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్) ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. నృత్య రూపకల్పన, నట్టువాంగంపై పరీక్షలు నిర్వహించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వ్యవహరించగా పరీక్షకులుగా నాట్యాచార్య ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం వ్యవహరించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P.No: 31/2025
సోమల బాల కోటేశ్వరమ్మ ..అర్జీదారు
-Vs-
టి. వెంకటేశ్వర్లు వగైరా ..రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
కృష్ణా జిల్లా ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నంబరు I.P.లో అర్జీదారురాలు అయిన సోమల బాల కోటేశ్వరమ్మ భర్త సోమల రామారావు, ఇ.నెం. 30/201, వెంకటరమణ కాలనీ, కర్నూలు సిటీ అను ఆమె తనను దివాలాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాలా అర్జీ (I.P) దాఖలు చేసినారు. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణలు ఉన్న 04.07.2025 తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల ఏకపక్షముగ విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
కె.కపిలేశ్వరయ్య, అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు. సెల్: 94404 70499

ఉసురు తీసిన అక్రమ తవ్వకాలు!

- ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి
- ఇంట్లో ఉన్న పిల్లాడిని పిలిచి చంపేశారంటూ తల్లి ఆవేదన
- కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న జనసేన నేతలు
- టీడీపీ నేత మట్టి అక్రమ తరలింపు కారణంగానే ఘటన!

కోనేరుసెంటర్: అక్రమ మట్టి తవ్వకాలు ఓ మైనర్ ఉసురు తీశాయి. ఘటన బందరు మండలం పొట్లపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం బుద్దాలపాలెం గ్రామానికి చెందిన కొక్కు మణికంఠ (15) పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. అతని తల్లిదండ్రులు కొండలరావు, జలజకుమారి వ్యవసాయ పనులు చేస్తుంటారు. వీరికి ఒక పాప కూడా ఉంది. ఇదిలా ఉండగా పదో తరగతి పాస్ అయిన మణికంఠ మట్టి ట్రాక్టర్‌పై పనికి వెళ్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌పై బుద్దాలపాలెం నుంచి కొత్తపూడి వెళ్లి మట్టిని డంప్ చేసిన అనంతరం తిరిగి మట్టి దిబ్బల వద్దకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. పొట్లపాలెం – బుద్దాలపాలెం మార్గంమధ్యలో రోడ్డుపై ఉన్న గోతిలోకి ట్రాక్టర్ ఒరగటంతో డ్రైవర్ పక్కన కూర్చున్న మణికంఠ ఒక్కసారిగా కిందికి పడిపోయాడు. ఘటనలో ట్రాక్టర్ ట్రక్కు టైరు మణికంఠ తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకుని రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్న మణికంఠను చూసి విలపించారు.



ప్రమాదంలో మృతి చెందిన కొక్కు మణికంఠ (ఫైల్)

అతన్ని అంబులెన్స్‌లో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మణికంఠ మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనపై తల్లి జలజకుమారి బందరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

పిలిచి చంపేశారయ్యా:

పదో తరగతి పాసైన ఆనందం మా బిడ్డకు ఎన్నో రోజులు లేకుండానే దేవుడు దక్కరకు వెళ్లిపోయాడయ్యా అంటూ తల్లిదండ్రులు పెడుతున్న ఆర్తనాదాలు చూపరులను సైతం కంటతడిపెట్టించింది. ఇంట్లో ఆడుకుంటున్న తన బిడ్డను ట్రాక్టర్ పనికి రమ్మంటూ పిలుచుకెళ్లి మరీ చంపేశారంటూ బోరున విలపించారు. మద్యం మత్తులో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్టేషన్‌లో తిష్టవేసి

ఇదిలా ఉండగా మైనర్ బాలుడు చనిపోయి అంత్యక్రియలైనా జరగకుండానే జనసేన నాయకులు ఈ కేసును నీరుగార్చడానికి బందరు రూరల్ పీఎస్‌లో తిష్టవేసి పోలీసులకు నయానో భయానో నచ్చజెప్పుకుని అక్రమంగా మట్టిని అమ్ముకుంటున్న గ్రామంలోని టీడీపీ నాయకుడిని బయటపడేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ కాగితాలు ఫోర్సులో లేకపోవటానికి తోడు డ్రైవర్‌కు లైసెన్స్ కూడా ఉండకపోవటం గమనార్హం. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ కేసులో ఏ విధంగా వ్యవహరిస్తారన్నది వేచి చూడాల్సిందే మరి.

ఈ పాపం ఎవరిదీ !

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో మట్టి మాఫియా ఆగడాలు అధికమయ్యాయి. మండలంలో అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మట్టి మాఫియా మరింత రెచ్చిపోతోంది. ఇదిలా ఉండగా బుద్దాలపాలెంలో జరిగిన ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారంటూ మృతుని తరఫు బంధువులు ప్రశ్నిస్తున్నారు.
అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న కూటమి నాయకులదా...? పట్టించుకోని రెవిన్యూ అధికారులదా...? లేక అధికార దర్పంతో మండలంలో మట్టిని అమ్ముకుని లక్షలు పోగుచేసుకుంటున్న ప్రజాప్రతినిధులదా అంటూ నిలదీస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



ఆలయంలో శ్రీచక్రనవార్చన



చండీహోమంలో ఉభయదాతలు

- వేసవి సెలవులు నేపథ్యంలో పెరిగిన సందడి
- అంతరాలయ దర్శనాలు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాసం.. పెద్ద ఎత్తున జరుగుతున్న వివాహాలు, వేసవి సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి దుర్గామల్లేశ్వరస్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే దుర్గామల్లేశ్వరస్వామివార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అంతరాలయంలో ప్రధాన మూలవిరాట్ వద్ద ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో జరిగిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీ హోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమం, గణపతి హోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. రూ. 300 టికెట్‌పై ముఖ మండప దర్శనాన్ని కల్పించిన ఆలయ అధికారులు, రూ. 100, సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తులు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం మహా నివేదన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఎండల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణం, మైక్ అనౌన్స్ పాయింట్ వద్ద దేవస్థానం భక్తులకు మజ్జిగను పంపిణీ చేసింది. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

15 మంది పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

ఆంధ్రా ఆస్పత్రి పిడియాట్రిక్ చీఫ్ డాక్టర్ రామారావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పుట్టుకతోనే అత్యంత క్లిష్టతరమైన గుండె సమస్యలు ఉన్న 15 మంది చిన్నారులకు విజయవాడ ఆంధ్రా హాస్పటల్‌లో ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. హీలింగ్ లిటిల్‌హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతె ఈ నెల 21 నుంచి 34వ ఉచిత హార్ట్ సర్జరీస్ క్యాంపు నిర్వహించినట్లు ఆస్పత్రి పిడియాట్రిక్ చీఫ్ డాక్టర్ వెంకట రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సర్జరీల వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బెంగుళూరుకు చెందిన పిడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ జగన్నాథ్‌తో పాటు, ఉషాశెట్టి, అశ్విని కుమారస్వామిలతో పాటు, ఆంధ్రా హాస్పటల్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావుల బృందం సర్జరీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి నెలా 50 నుంచి 60 మంది పిల్లలకు గుండె సర్జరీలు చేస్తూ, ఇప్పటి వరకూ ఆస్పత్రిలో 4,500 మందికి చిన్నారులకు గుండె సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రా మదర్ అండ్‌చైల్డ్ ఫౌండేషన్, మహేష్‌బాబు ఫౌండేషన్ సహకారం కూడా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో శస్త్ర చికిత్సలు చేసిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.వి.రామారావు తదితరులు

పర్యాటకులకు అందుబాటులో అరకు కాఫీ

పైలెట్ ప్రాజెక్టుగా విజయవాడ బెరంపార్క్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సేంద్రియ పద్ధతుల్లో అరకులోయలో గిరిజనులు పండిస్తున్న కాఫీ గింజలతో తయారు చేసేదే అరకు కాఫీ. అరకులో తయారయ్యే ఈ ఆర్గానిక్ కాఫీ ప్రస్తుతం అమరావతిలోని సచివాలయంలో అధికారులకు, ఉద్యోగులకు లభిస్తున్న విషయం విదితమే. ఇకపై ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. శుక్రవారం సచివాలయం నుంచి వచ్చిన సిబ్బంది హరిత బెరంపార్క్ సిబ్బందికి ఫిల్టర్ మెషిన్, మిల్క్ బాయిలర్ ద్వారా డెమో ఇచ్చారు. విజయవాడ హరిత బెరంపార్క్‌లో మొట్టమొదటి సారిగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టారు. పర్యాటక శాఖ విజయవాడ, కాకినాడ, తిరుపతి డివిజన్లలోని సూర్యలంక, దిండి, హార్సిలీ హిల్స్‌ల్లో పర్యాటకులకు అరకు కాఫీ రుచిని చూపించనున్నారు.

దోమ కాటుతో వ్యాపించే వ్యాధులపై అప్రమత్తం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దోమ కాటుతో వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగూ, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం, ఫ్రైడే డ్రై డే పురస్కరించుకుని శుక్రవారం గొల్లపూడి సచివాలయం-2లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిని మాత్రమే కాకుండా చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు మాట్లాడుతూ ఈ ఏడాది మలేరియా దినోత్సవ నినాదం 'వనరుల చేకూర్పు, మరలా కొత్తగా ఆలోచించు, మళ్లీ ఉత్తేజం పొందు' స్ఫూర్తితో వైద్య ఆరోగ్య సిబ్బంది పని చేయాలన్నారు. కొండపల్లి పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన సదస్సులో డెప్యూటీ డైరెక్టర్ రామనాథం, రూరల్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మురళీకృష్ణ, స్టేట్ ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి, బయాలజిస్ట్ సూర్య, సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధులపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పద్మావతి తదితరులు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలకు నియమించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా వేముల బేబీరాణి, పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి, పబ్లిసిటీ వింగ్ కార్యదర్శులుగా చోడవరపు జగదీష్, పటమట దుర్గాప్రసాద్, గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా చింత చిన్నబుచ్చిబాబు , గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా పులి రమణారెడ్డి నియమితులయ్యారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా 'తుమ్మా'

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తుమ్మా జయరాం రెడ్డిని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తనపై విశ్వాసం ఉంచి తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన పార్టీ పెద్దలకు జయరాం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణా జిల్లాకు చెందిన వారు..

రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా మోకా వెంకటేశ్వరమ్మ, పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా బూరగడ్డ శ్రీకుమార్, పబ్లిసిటీ వింగ్ కార్యదర్శులుగా ప్రత్తివాడ రాఘవరావు గాజుల జయగోపాల్‌ను నియమించారు.
గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శిగా గాజుల భగవాన్, గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కనగాల హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు దీనిపై తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

సంగీతంలో నిస్వార్థ సేవకే గిన్నిస్ రికార్డ్

ఎషువ బెత్ హాలెల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అగస్టిన్

పటమట(విజయవాడతూర్పు): వాయిద్యకారులను అనేక మందిని తయారు చేయాలనే లక్ష్యంతో హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌ను ప్రారంభించినట్లు ఎషువ బెత్ హాలెల్ మినిస్ట్రీస్ ఫౌండర్ దండింగి అగస్టిన్ తెలిపారు. క్రీస్తు సంగీతంలో నిస్వార్థ సేవ చేసినందుకుప గిన్నిస్ రికార్డు వచ్చిందన్నారు. శుక్రవారం విజయవాడ ఏలూరు రోడ్‌లోని గుణదల మెట్రోపాలిటన్ చర్చిలో సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా సంగీతంలో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం దండింగి అగస్టిన్ మాట్లాడుతూ దాదాపు 18 దేశాల్లో ఉన్న 7,500 మంది విద్యార్థులకు ఉచితంగా సంగీత విద్యను నేర్పించామన్నారు. ఏడేళ్ల నుంచి 80 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఎవరైనా నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కోర్స్ పూర్తిగా ఉచితమని, ఎటువంటి ఫీజు లేదన్నారు. గిన్నిస్ రికార్డు కోసం రెండేళ్ల నుంచి ప్రయత్నిస్తున్నామని, మూడో యత్నంగా వచ్చిందన్నారు. తన సేవలను గుర్తించి ఇంజినియస్ చాంవరల్డ్ రికార్డు గోల్డెన్ ఐకానిక్ అవార్డును తనకు ప్రత్యేకంగా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అగస్టిన్ కుటుంబ సభ్యులతో పాటు హాలెల్ మ్యూజిక్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



గిన్నిస్ రికార్డుతో అగస్టిన్

స్మార్ట్ ఫోన్‌గానీ, చెల్లించిన మొత్తాన్నిగానీ తిరిగి ఇవ్వాలి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుడికి తాను బుక్ చేసిన స్మార్ట్ ఫోన్ లేదా చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన మాగంటి వేణు అమెజాన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 35,999 విలువైన ఐక్యూనియో నైన్ ప్రో స్మార్ట్ ఫోన్ బుక్ చేశారు. అయితే రియల్‌మీ నార్జో ఎన్ 61 ఫోన్ పార్సిల్‌లో వచ్చింది. ఆర్డర్ చేసిన ఫోన్ కాకుండా వేరే ఫోన్ రావడంతో ఆయన రిటర్న్ చేశారు. అలా మూడు సార్లు బుక్ చేసిన ఫోన్ కాకుండా వేరే ఫోన్ వచ్చింది. తాను కట్టిన అమౌంట్ రిటర్న్ చేయాలని లేదా ఆర్డర్ చేసిన ఫోన్ పంపాలని వేణు కంపెనీకి మెయిల్ చేశారు. అమెజాన్ కంపెనీ మూడుసార్లు ప్రొడక్ట్ పంపించాం కనుక మీ నగదు రిటర్న్ చేయబోమని తిరస్కరించారు. దీంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన అనంతరం కమిషన్ సభ్యులు ఆర్డర్ చేసిన ఫోన్ పంపాలని లేదా కట్టిన నగదును రూ. 35,999 ట్యాక్స్ ఇన్‌వాయిస్ పంపిన నాటి నుంచి తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. మానసిక వేదన కలిగించినందుకు రూ. 10 వేలు, రూ. 5 వేలు ఖర్చుల నిమిత్తం అమెజాన్ కంపెనీ తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా వినియోగదారుడికి అందజేయాలని తీర్పు ఇచ్చారు.

కేసరపల్లిలో చోరీ

280 గ్రాముల బంగారు ఆభరణాల అపహరణ

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి శివారులోని ఓ కాలనీలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఇంటిలో అందరూ నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడి సుమారు 280 గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. కేసరపల్లిలోని ఎఫ్‌సీఐ గోడౌన్ రోడ్డులో ఉన్న సాయిశ్రీనివాస కాలనీలో విజయవాడకు చెందిన అకౌంటెంట్ పి. వెంకటేశ్వరరావు, ఆయన భార్యతో ఉంటున్నారు. వీరి కుమార్తె, కుమారుడు అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవల కుమార్తె ఇండియాకు రాగా, ఓ శుభకార్యం నిమిత్తం బ్యాంక్ లాకరులో ఉన్న బంగారాన్ని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కుటుంబ సభ్యులందరూ ఇంటి పైఅంతస్తులో నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడ్డారు. బీరువాలో సుమారు 280 గ్రాముల వరకు ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. తెల్లవారుజామున వెంకటేశ్వరరావు భార్య బీరువా తెరచి ఉండడం గమనించారు. లోపల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇటీవల కాలంలో కేసరపల్లిలో దొంగలు హల్‌చల్ చేస్తూ చోరీలకు పాల్పడటంపై గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

కూలీలపై దూసుకెళ్లిన కారు

ఐదుగురికి గాయాలు

జగ్గయ్యపేట అర్బన్: చెరువుబజారులో కొత్త రైతుబజారు వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో పనులు కోసం వేచిచూస్తున్న పలువురు కూలీలపైకి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఓర్సు రామకృష్ణ, తాళ్లూరి వాసు, బండి నాగరాజు, కుంచపు నాగరాజు, బత్తుల వెంకట గురువులు అనే ఐదుగురు కూలీలు గాయపడ్డారు. కారు వారిని ఢీకొన్న తర్వాత ఇనుప పోల్‌కు తగిలి ఆగిపోయింది. గాయపడిన వారిని స్థానికుల సాయంతో ప్రథమ చికిత్స కోసం జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ వెంకటేశ్వర్లు కూడా చెరువు బజారు వాసే. కిరాయికి కారు నడుపుతుంటాడు. అతను ఆ సమయంలో పూటుగా మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం వారిని డిశ్చార్జ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) వారిని పరామర్శించారు. ప్రమాద సంఘటనపై పోలీసులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. పట్టణ ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




పేటలోని చెరువుబజారులో కూలీలపై దూసుకుపోయిన కారు ఇదే

వివాహిత బలవన్మరణం

కంకిపాడు: వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డ వివాహిత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన రేష్మ (25)ను నెప్పల్లి గ్రామానికి చెందిన ముదునూరు వినోద్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. భర్త వినోద్, అత్తమామలు రేష్మను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. వాటిని తాళలేక ఈనెల 12న ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తింది. వెంటనే ఆమెను మంగళగిరిలోని ఎయిమ్స్‌కు వైద్యం నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించారు. తహసీల్దార్ వి.భావనారాయణ పర్యవేక్షణలో శవ పంచనామా చేశారు. ఈ మేరకు మృతురాలి తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

వారంలో పెళ్లి.. విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తాళ్లూరు(వత్సవాయి): పది రోజుల్లో వివాహం చేసుకుని సంతోషంగా జీవితాన్ని గడపాల్సిన యువకుడు విద్యుదాఘాతంతో మరణించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేశ్వర్లు, భూలక్ష్మి దంపతుల కుమారుడు జితేంద్ర(25). అతను ఆటోలో ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తుండేవాడు. జితేంద్రకు ఇటీవల వివాహం నిశ్చయమైంది. వారం రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి కార్యక్రమాల ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. గురువారం రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న కూలర్‌లో నీళ్లు పోస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి ఒక్కసారిగా కరెంట్ షాకు కొట్టడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగు వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పదిరోజుల్లో వివాహం చేసుకుని ఘనంగా ఊరేగింపు చేసుకోవాల్సిన తరుణంలో ఇలా అంతిమయాత్ర చేసుకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఘటనపై తల్లి భూలక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు.



కంచర్ల జితేంద్ర(ఫైల్)

ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి..

ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మోపిదేవివార్పు(మోపిదేవి): మోపిదేవివార్పు వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అవనిగడ్డకు చెందిన యాసా బాలభాస్కర్(21), బంతుల సుధాకర్(18) ద్విచక్రవాహనంపై చల్లపల్లి వైపు నుంచి అవనిగడ్డ వస్తుండగా ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొన్నారు. వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు పి.గౌతమ్, కె.యువతేజ గాయపడి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ శ్రీనివాస టిప్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE
■ విజయవాడలో 6 సెంట్లు 1 కోటి 25 లక్షలు, నూజివీడులో 3 సెంట్లు 9 లక్షలు, 4 సెంట్లు 12 లక్షలు, 5 సెంట్లు 15 లక్షలు. వాట్సాప్ 95158 77494, ✆ 97019 35757
■ నెలకు 80,000 అద్దెలు వచ్చే 250 చ।।గ।। నిర్మించిన G+3 Pent House గల బిల్డింగ్ విజయవాడ ప్రసాదంపాడులో అమ్మకమునకు కలదు. రేట్ 3.25 cr సెల్ : 94403 73594

PLOT FOR SALE
■ బెంజిసర్కిల్‌కి 5 km CRDA LP No. 62/24, 45/24 రేరా గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, హౌసెస్, విల్లాలు బ్యాంక్ లోన్. స్పాట్ రి. ✆ 95531 29369
■ బెంజిసర్కిల్ నుండి 20 ని।।లలో మచిలీపట్నం పోర్టు నుండి 10 ని।।లలో NH-65 హైవేకి అనుకొని ఉన్న విల్లాస్ ఓపెన్ ప్లాట్లు గజం రూ. 5,500/- మాత్రమే. Only 5 Plots Offer. ✆ 70757 79530.
■ పామర్రు NH-65 హైవేకి K హోటల్ అనుకొని ఉన్న విల్లాస్ ఓపెన్ ప్లాట్స్ గజం రూ. 5,500/- మాత్రమే. Only 5 Plots Offer. ✆ 79891 19836

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి. 7406393937

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED
■ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలో పని చేయుటకు కౌంటర్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Contact number: 92471 13200, Calling time 10am to 7pm
■ విజయవాడ, గాంధీనగర్ ఆఫీస్‌లో స్వీపర్‌గా పనిచేయుటకు ఒక అబ్బాయి కావలెను. సంప్రదించవలసిన ఫోన్ ✆ 70135 11502
■ WANTED B.Com / M.Com / MBA Finance / CA IPCC Dropouts to be work as Back end in Vijayawada / Hyderabad in a reputed audit firm. Interested persons (male only) contact no 70135 11502 for further information or mail to kowthahr@gmail.com
■ Wanted exp. Tele Callers (F) Qlf: Int / Deg / PG. Sal: 16K + Inct + Bonus. Location: Kankipadu & Benz Circle. Ph: 99129 49835, 70933 19488
■ లేడీ టెలీకాలర్స్ - 10 No.s - మరియు మేల్ ఆఫీస్ అసిస్టెంట్-1, ప్రముఖ ఆఫీసులో పనిచేయుటకు కావలెను. Q.10th/ఇంటర్, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి. జాబ్ లోకేషన్ విజయవాడ. ✆ 99669 88544
■ S.V. కెమికల్స్ : హౌస్ క్లీనింగ్ ప్రొడక్ట్స్ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు M/F యువతీ/యువకులు కావలెను. Qly : 10th పైన ✆ 99128 97878 / 76708 64345
■ ఇండ్లాస్ శాంతివన్ హాస్పటల్, నున్నలో పని చేయుటకు Male / Female నర్సింగ్ స్టాఫ్ కావలెను. వివరాలకు Cell: 79933 49847
■ మా ప్రొడక్ట్స్ మార్కెటింగ్ చేయుటకు 20 సం।। నుండి 50 సం।।లోపు వారు కావలెను. డైలీ అలవెన్స్ రూ. 300/- నెల శాలరీ : రూ. 15,000/- నుండి రూ. 30 వేలు వరకు ✆ 83175 28192
■ విజయవాడ బస్టాండ్ నందు గల ATM నందు 12 గంటల డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వయస్సు 55 సంవత్సరముల లోపు. ✆ 82476 62299
■ మా వి.ఐ. కంపెనీలో పార్ట్/ఫుల్ టైం టీమ్ వర్క్ చేయుటకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, M.B.A అభ్యర్థులు 57 మంది కావలెను. గృహిణులు అర్హులు. P/T 13K, F/T 25K. ✆ 83413 26701
■ మా మ్యారేజ్ సంస్థకు కంప్యూటర్ నాలెడ్జ్ గల లేడీ ఇన్‌చార్జి జీ: 20,000/- & కంప్యూటర్ నాలెడ్జ్ గల లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. జీ: 15,000/- Any Degree. ✆ 87905 99799
■ Wanted Packing Boys for Medical Agencies @Srinivasa Drugs, Bhavanipuram. Cell: 9704071271.
■ కిడ్నీలెట్స్ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు, ఫ్రీ రూం + భోజనం .Hyd. 7993583999
■ A-Z Abroad Edu Counsellor, Front desk & BPO, Eng&Hindi, age :21-30 Day/Night Shift, Female/ Male Ph:8978555901, 7386764441

గమనిక

సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మచిలీపట్నం, పెడన 9912220543
అవనిగడ్డ 7995666003
గుడివాడ 7995092118
పామర్రు 9010677706
పెనమలూరు 9951602985
నందిగామ 7995092114
జగ్గయ్యపేట 9912220547
మైలవరం, ఇబ్రహీంపట్నం 9010221734
తిరువూరు 9951020399
నూజివీడు 9912220544
ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా
రూ. 600/-
రూ. 150/-
+ 5% GST